సాగుకు భరోసా

శ్రీరాంసాగర్‌కు భారీ వరద



- ప్రాజెక్టులో 41 టీఎంసీలకు పైగా నీటి నిల్వ
- 53 వేల క్యూసెక్కులకు పైగా వస్తున్న నీరు
- రెండు పంటలకు తప్పనున్న తిప్పలు
- ఆనందంలో అన్నదాతలు
- నేడు హైద్రాబాద్ జలసౌధలో శివం కమిటీ సమావేశం

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రైతాంగానికి వానాకాలం పంటకు అవసరమైన సాగునీటి భరోసా వస్తోంది. జిల్లాలో ప్రధాన నీటి వనరు అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడం రైతాంగంలో ఆనందం నింపుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 41 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉంది. జిల్లా రైతాంగానికి సరిపోయే విధంగా ఎస్సారెస్పీ నీరు ఇచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు నో ఫికర్‌గా ఎస్సారెస్పీలోకి వరద నీరు చేరుతుండడం పట్ల అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

53 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో...

మహారాష్ట్రలో గోదావరిపై నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తడం, నాందెడ్ జిల్లాలో ఉన్న విష్ణుపురి, అందూరా, బాలేగావ్ ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండడంతో గేట్లు ఎత్తడం వల్ల ఎస్సారెస్పీ లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బాలేగావ్ ప్రాజెక్టుకు చెందిన నాలుగు గేట్లను ఎత్తి సుమారు 50 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బాలేగావ్ నుంచి శ్రీరాంసాగర్ వరకు సంబంధిత నీరు రావ డానికి సుమారు 14 గంటల నుంచి 16 గంటలు పడుతోంది. దీంతో రెండు రోజులుగా ఎస్సారెస్పీలోకి భారీగా వరద నీరు చేరుతోంది. ప్రతీ యేటా జూన్‌లో వరద ప్రారంభమై జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో వరద నీరు ఎక్కువగా వస్తుంటుంది. ప్రాజెక్టు నిండితే గేట్లను ఎత్తుతారు. వరద కాలువకు, గోదావరిలోకి నీటిని వదులుతారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలోకి సుమారు 53 వేలకు పైగా క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జూన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు 34.168 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. 90.323 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 41.139 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయంలో ప్రాజెక్టులో 76.499 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రానున్న రోజుల్లో మరింత వరద నీరు వచ్చి ప్రాజెక్టు నిండే అవకాశాలున్నట్లు ఎస్సారెస్పీ అధికార వర్గాలు అంటున్నాయి.

జిల్లాలో అధిక శాతం శ్రీరాంసాగర్ పైనే...

జిల్లాలో అన్నదాతలు అధిక శాతం ఎస్సారెస్పీ నీటిపైనే ఆధాపడి సాగుచేస్తుంటారు. సుమారు 1.63 లక్షల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు ఉంటోంది. ప్రతియేటా ఎస్సారెస్పీ జలాలు విడుదల చేస్తుండడంతో రైతులకు సాగునీటి కష్టాలు తప్పాయి. ప్రాజెక్టుకు అంచనాకు మించి ఇప్పటికే వరద నీరు చేరడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతుల ఆశలు నెరవేరుతున్నట్లయింది. రెండు, మూడు రోజులుగా ఎస్సారెస్పీకి రికార్డు స్థాయిలో వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు నుంచి తాగునీటి అవసరాలు, నీటి లెక్కలు కలుపుకొని వానాకాలంలో ప్రాజెక్టు ఆయకట్టుకు నీటి సరఫరా చేపడుతుంటారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని వానాకాలం పంటకు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో జిల్లా రైతుల్లో ఆశలు చిగురుస్తున్నాయి.

నేడు హైద్రాబాద్‌లో శివం కమిటీ సమావేశం..

ఈనెల 3వ తేదీన హైద్రాబాద్‌లోని జలసౌధ కార్యాలయంలో రాష్ట్ర సాగునీటి, సమీకృత, నీటి నిర్వహణ, ప్రణాళిక, స్టాండింగ్ ఉన్నత స్థాయి కమిటీ (శివం)సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సాగు కాలువలకు నీటి విడుదలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. వర్షాలు భారీగా పడి వరదలు వచ్చే పరిస్థితులు ఉండడం, ఎస్సారెస్పీ ఎగువను ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసి వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలు, ఎత్తిపోతల పథకాల కింద సాగయ్యే పంటలకు నీటి విడుదల చేసేందుకు కమిటీ సమావేశంలో ఆమోదం తెల పనుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఆయకట్టుకు నీటి అవసరానికి అనుగుణంగా ఆన్ ఆఫ్ పద్ధతిలో విడుదల చేసేందుకు అవకాశాలున్నాయంటున్నారు. ప్రాజెక్టులోకి ఆశించిన రీతిలో వరద నీరు వస్తుండడంతో నీటి విడుదల ఖాయమవుతోంది. ప్రాజెక్టులోకి 60 టీఎంసీల నీరు నిల్వ ఉంటేనే నీటి విడుదల జరుగుతుందని ఎస్సారెస్పీ వర్గాలు అంటున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

అక్టోబరు వరకు వరద నీరు...

ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి ప్రతీయేటా అక్టోబర్ మాసాంతం వరకు వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాన గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ప్రతీయేటా న్యాయస్థానం ఆదేశాల ప్రకారం జూలై 1వ తేది నుంచి అక్టోబర్ 28వ తేది వరకు తెరిచి ఉంచుతారు. ఎగువ ప్రాంతాన వర్షాలు సమృద్ధిగా కురిస్తే ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. సాధారణంగా ఎస్సారెస్పీ నిండుకుండలా మారడానికి సెప్టెంబర్‌లో ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు వచ్చే అవకాశాలు న్నట్లు అధికారులు అంచనా వేస్తుంటారు. సెప్టెంబర్ మాసం వరకు మరో సుమారు రెండు నెలల వ్యవధి ఉంది. ప్రస్తుతం వచ్చిన వరద నీరు, సెప్టెంబర్ మాసం వరకు వచ్చే వరద నీరు కలుపుకుంటే ఈ ఏడాది ప్రాజెక్టు నిండడం ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తం అవు తున్నాయి. ప్రాజెక్టు వరద నీటితో నిండితే గేట్లు ఎత్తి గోదావరిలోకి విడుదల చేయడానికి అనుగుణంగా అధికారులు ఆలోచన చేస్తున్నారు.

ఆయకట్టు రైతుల్లో ఆశలు...

ఎస్సారెస్పీ ఆయకట్టు 18,66,765 ఎకరాలు కాగా ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 6,72,900 ఎకరాలు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1,60,578 ఎకరాలు, ఆదిలాబాద్ జిల్లాలో 1,45,387 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 4,71,478 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 1,28,914 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 2,87,508 ఎకరాలు ఉంటోంది. జగిత్యాల జిల్లా రైతాంగానికి కాకతీయ కాలువ ద్వారా 1.63 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. దీనికితోడు వరద కాలువ సైతం రైతాంగానికి ఉపయోగపడుతోంది. ప్రాజెక్టులోకి ఆశించిన స్థాయిలో వరద నీరు వస్తుండడం, బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం వంటి కారణాల వల్ల ఆయకట్టు రైతుల్లో ఆశలు చోటుచేసు కుంటున్నాయి.

జిల్లా వ్యాప్తంగా వివిధ పంటల సాగు ఇలా..

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సుమారు 4.24 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తారన్న అంచనాలున్నాయి. ఇందులో ప్రధాన పంటలయిన వరి 3.05 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 41 వేలు, కంది 13 వేలు, పత్తి 22 వేలు, పసుపు 12 వేల ఎకరాల్లో సాగు అవు తుందని వ్యవసాయ అధికారులు అంచనా. సుమారు 30 వేల ఎకరాలలో రైతులు ఆయిల్ పామ్ వైపుకు మళ్లనున్నట్లు అంచనా ఉంది. మినుము, అనుము, చెరకు, సోయా, కూరగాయాల తదితర పంటలను రైతులు పం డించనున్నారు. జిల్లాలో ప్రస్తుతం వరి నాట్లు వేసే పనులను రైతులు పూర్తి చేస్తున్నారు.

పంటల సాగు వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు వివరా లను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ఏఏ పంటలను ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రతి క్లస్టర్‌లో ఆన్‌లైన్‌లో పంటల సాగును నమోదు చేయాలని తెలిపారు. యూరియా కొరత లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధి కారి ప్రతాప్ సింగ్, అగ్రికల్చర్ కార్యాలయ అధికారి కల్పన, డీపీవో రఘువ రన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్‌లు త్వరితగతిన మంజూరు

జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ గంగాధర్



ఏస్‌ఈ గంగాదర్

జగిత్యాల అర్బన్, జూలై 2: రైతు లకు త్వరితగతిన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్‌లు మంజూరు చేస్తున్నామని జగిత్యాల సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీయర్ గంగాధర్ తెలిపారు. గత ఏడాది 8నెలల్లో 1310 సర్వీసులు అందించగా, ఈ ఏడాది జూలై చివరి వరకు 1854 సర్వీసు కనెక్షన్‌లు మంజూరు చేశామన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే 544 సర్వీసులు మంజూరు పెరిగిందన్నారు. సర్వీసుల మంజూరు ప్రక్రియ ఆన్‌లైన్ చేయడంతో ఎలాంటి జాప్యం జరగకుండా వెళ్తున్నామన్నారు. పేపర్ వర్క్ లేకుండా ఆన్ లైన్ విధానంతో విద్యుత్ శాఖకు, రైతులకు సేవలందించడం సులభతరం అవుతుందన్నారు. దీంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నామని, లూజ్‌లైన్‌లు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యుత్ అధికారులు రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా పొలం బాట చేపట్టామన్నారు. రైతుల వ్యవసాయ సర్వీసుల మంజూరుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని వెనువెంటనే మంజూరు చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను పకడ్బందీగా చేపట్టాలి

మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈ నెల 5 నుంచి నిర్వహించ తలపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జగిత్యాల మున్సిపాలిటీలో పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి పేర్కొన్నారు. పచ్చదనం-స్వచ్ఛదనం నిర్వాహణ కార్యక్రమంపై మున్సిపల్ సమావేశ మందిరంలో మెప్మా ఆర్పీలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. చైర్ పర్సన్ జ్యోతి, కమిషనర్ సమ్మయ్యలు హాజరై మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 48 వార్డుల్లో ఈ నెల 5న పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. 6న తాగు నీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, 7న మురుగు కాలువల్లో నీటి నిలువ ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయాలన్నారు. 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహనతో పాటు వీధి కుక్కల దాడుల నివారణ, చివరి రోజు 9న డ్రై డేలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయాలన్నారు. డీఈ యాదగిరి, మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

తల్లిదండ్రుల బాగోగులను విస్మరిస్తే శిక్షార్హులే

జగిత్యాల ఆర్‌డీఓ మధుసూదన్

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పోషణను, బాగోగులను విస్మరిస్తే కుమారులు శిక్షార్హులేనని జగిత్యాల ఆర్‌డీవో మదుసూదన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్‌డీవో మదుసూదన్‌ను వివిధ గ్రామాలకు చెందిన వయోవృద్ధులైన తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేస్తున్న తమ కుమారులు, కోడళ్లపై సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆర్‌డీవో మాట్లా డారు. వయోవృద్ధుల సంక్షేమానికి అవసరమైన కృషిని చేస్తున్నామన్నారు. పలువురు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని సీఎంకు వినతి

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎన్‌ఆర్‌ఐల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి జగిత్యాలకు చెందిన గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధి మంద భీంరెడ్డితో పాటు పలువురు నేతలు కలిశారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డిని వినతిపత్రం అందించడంతో సమస్యలను విన్నవించారు. గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలని, గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా అందించాలని కోరారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాయికల్, ఆగస్టు 2: ఇంటి పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాయికల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ అన్నారు. రాయికల్ పట్టణంలోని అన్ని వార్డులలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా వార్డు అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా ఆర్‌పీలు ఇంటింటా డ్రై డే కార్యకలాపాలు నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వేయించడమైనది. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి.వెంకటి, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, వార్డు అధికారులు, మెప్మా ఆర్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగిన జర్నలిస్టుల ఆందోళన

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల సాధన కోసం జగిత్యాల పట్టణ జర్నలిస్టులు చేపట్టిన ఆందోళన నాలుగవ రోజు శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి తహసీల్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి తమ నిరసనను తెలియజేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి తమకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రభుత్వానికి నివేదించాలని కోరుతూ కలెక్టర్ సత్య ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. జర్నలిస్టు సంఘం నాయకులు శ్రీనివాసరావు, ప్రదీప్ కుమార్, గోపాల చారి, టీవీ సూర్యం ఉన్నారు.

బీసీల్లో చైతన్యంతోనే అభివృద్ధి సాధ్యం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 2: బీసీల్లో చైతన్యం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని, దీని కోసం దేశమంతా ఉద్యమాన్ని విస్తరించాల్సిన ఆవశ్యకత ఉందని బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాండభేరి నరేష్ అన్నారు. ఆగస్టు 7న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జరగబోయే అఖిల భారత ఓబీసీ మహాసభ కార్యక్రమ పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ అంటూ మనమే మన కులాలను వెనక్కు నెట్టివేసుకుంటున్నామన్నారు. అలాంటి మనం ఇకపై బీసీలంటే బ్రిలియంట్, బిగ్గెస్ట్, బెస్ట్ క్యాస్ట్‌లని చాటిచెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశసంపదకు మూలం బీసీలేనని, వారి చెమట, నెత్తుటి చుక్కలతో సంపదను సృష్టిస్తున్నా మన్నారు. అమృత్ సర్‌లో జరిగే 9వ అఖిల భారత జాతీయ బీసీ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి బీసీ ప్రతినిధులు తరలివచ్చి ఐక్యతను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు నల్ల వెంకటేశ్వర్, జల, బోగోజి ముఖేష్ ఖన్నా, వరదసాయి, రవి పాల్గొన్నారు.

ప్రభుత్వాల సహకారంతో ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధి చెందాలి

ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్

కోరుట్ల, ఆగస్టు 2 : ఎస్సీ ఎస్టీ వర్గాల అభివృద్ధి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రదాని నరేంద్ర మోది, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉద్యమకారుడు మంద కృష్ణ మాదిగల చిత్ర పటాలకు క్షీరాభిషకం చేసి సంబరాలను జరిపారు. ఎస్ ఎస్టీ వర్గీకరణను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంత రాజం, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మినారాయణ, ఎంబేరి నాగభూషణం, సంఘ సభ్యులు ఇట్యాల రాజేందర్, బెక్కం ఆశోక్, చిట్యాల ప్రభాకర్, మోర్తాడ్ రాజశేఖర్, నరేష్, చిట్యాల లక్ష్మణ్, లచ్చయ్య, దోబ్బల వెంకటేష్ పాల్గొన్నారు.

కథలాపూర్ : ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కథలాపూర్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకు లు భారీ ర్యాలీ నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో మూడు దశాబ్దాల పోరాటం ఫలించిందన్నారు. ఈ ర్యాలీకి బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగారపు చిన్నయ్య, కాశవత్తుల లక్ష్మీరాజం, కిషన్, గంగాదర్, పాల్, శేఖర్ ఉన్నారు.

రాయికల్: మాదిగ రిజర్వేషన్ లకై పోరాటం చేసి సాధించిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి శుక్రవారం రాయికల్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

అనంతరం టపాసులు కాల్చి, స్వీట్లు పంచుతూ మాదిగ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నక్క సతీష్, తలారి రాజేష్, బాపురపు నర్సయ్య, దొబ్బల వేణుగోపాల్, దూలూరి నారాయణ, బొమ్మెన ప్రకాశ్, నిషా భూమేష్, లింగంపల్లి రాజేష్, బాబు, రాజేష్, రాంప్రసాద్, రాకేష్, గంగరాజం, నరసింహ, రాజేందర్, లావణ్, బెక్కం వెంకటేష్, రాజశేఖర్, కండ్లపెల్లి సాయి కుమార్ పాల్గొన్నారు.

మల్యాల: సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడం పట్ల మండలంలోని మద్దుట్లలో అంబేద్కర్ యువజన సంఘం అధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచారు. అంతకు ముందు ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





కోరుట్లలో మోదీ, రేవంత్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం..రాయికల్‌లో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



కోరుట్లలో పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మాజీ సర్పంచులు

ధర్మపురి, ఆగస్టు 2: పెండింగ్ బిల్లుల గురించి హైదరాబాద్‌లోని సెక్రటరేట్ ఎదుట శుక్రవారం నిర్వహించే శాంతి యుత ధర్నాకు బయలు దేరిన ధర్మపురి మండల మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని 12 మంది మాజీ సర్పంచుల ధర్నాకు వెళుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్ఐ ఉదయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు వారందరిని అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం వారందరిని ఆయన వదిలిపెట్టారు.

కోరుట్ల : అసెంబ్లీ ముట్టడి కార్యచరణకు ముందే పోలీసులు ముందస్తు చర్యలను చేపట్టారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అయా గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకున్నారు. మాజీ సర్పంచ్‌లు దారిశెటిట రాజేష్, వనతడుపు అంజయ్య, బాస్కర్ రెడ్డి, చెప్యాల నర్సయ్య, రవిలతో పాటు బీఆర్ఎస్ నాయకులు పిడుగు నందయ్య, దుంపాల రాజనర్సయ్య, ముత్తయ్యలను అదుపులోకి తీసుకుని సాయంత్రం విడుదల చేశారు.

పెగడపల్లి : మండలంలో తాజా మాజీ సర్పంచులను శుక్రవారం తెల్లవారుజామున అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. గ్రామపంచాయతీలలో పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేసి తమను ఆదుకోవాలని కోరుతూ తాజా మాజీ సర్పంచులు శుక్రవారం నిర్వహించతలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడి విఫలంలో బాగంగా పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కోరుకంటి రాజేశ్వర్‌రావు, ఉప్పు లంచ లక్ష్మణ్, బాబుస్వామి, బాలుసాని నిహారిక స్వామి, లక్ష్మిమోహన్ రెడ్డి, స్వప్న ఆనందం, అంజమ్మ మల్లేశం, భాగ్యలక్ష్మి ప్రశాంత్, హారిక గంగాధర్ అరెస్టయిన వారిలో ఉన్నారు.

కొడిమ్యాల : మండలంలోని పలువురు తాజా మాజీ సర్పంచులను కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు మల్లేశంముదిరాజు, స్వామి రెడ్డి, మహిపాల్, తిరుపతి, మల్లేశంయాదవ్ ఉన్నారు.

కథలాపూర్ : గ్రామపంచాయతీల్లో ఉన్న పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తాజా మాజీ సర్పంచులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పలు గ్రామాల తాజా మాజీ సర్పంచులను ఎస్సై నవీన్ అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బీర్‌పూర్ : సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ హైదారాబాద్ సెక్రటేరియట్ యెదుట శాంతియుత నిరసనకు వెల్లెందుకు సిద్ధమవుతున్నారని తెలుసుకున్న బీర్‌పూర్ పోలీసులు శుక్రవారం మాజీ సర్పంచ్‌లు మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు నల్ల మహిపాల్‌రెడ్డి, గర్షకుర్తి శిల్ప, సీపతి రమేష్, మేను యేసుదాసు అదుపులోనికి తీసుకున్నారు.

గొల్లపల్లి: మండలంలోని పలువురు బీఆర్ఎస్ తాజామాజీ ప్రజా ప్రతినిధులను పోలీసులు ముందస్తుగా శుక్రవారం అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల శాఖ అధ్యక్షుడు, తిర్మలాపూర్ (పీడీ) మాజీ సర్పంచ్ ఎరవేణి రమేష్, రాపల్లె మాజీ సర్పంచ్ నల్ల శ్యామ్, చెందోళి మాజీ సర్పంచ్ అలిశెట్టి రవీందర్‌తో పాటు మరో ముగ్గిరిని ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తు పోలీసులు వదిలిపెట్టారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

ఎస్పీ అశోక్ కుమార్



అడిషనల్ ఎస్‌పీ వినోద్‌ను సన్మానం చేస్తున్న ఎస్‌పీ అశోక్ కుమార్

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తమమైన సేవలతో ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న అడిషనల్ ఎస్పీ వినోద్ కుమార్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో అదనపు ఎస్‌పీగా వినోద్‌కుమార్ సేవలు అభినందనీ యమన్నారు. ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, పదవీవిరమణలు సర్వసాధారణమన్నారు. పదవీ కాలంలో అందించిన ఉత్తమైన సేవలు ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పీ బీమ్ రావు, డీఎస్‌పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, ఉమా మహేశ్వర్ రావు, రంగారెడ్డి, డీసీఆర్‌బీ, ఎస్‌బీ, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, అరిఫ్ అలీ ఖాన్, లక్ష్మీ నారాయణ, సీఐలు వేణుగోపాల్, రవి, కృష్ణరెడ్డి, రామకృష్ణ, కిరణ్, వేణు పాల్గొన్నారు.

ఏడుగురిపై వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, ఆగస్టు 2: భర్త తరుపు కుటుంబీకులు అదనపు వరకట్నం కోసం వేదిస్తున్నారని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. జమ్మికుంటకు చెందిన రమ్యకు హైదరాబాద్‌కు చెందిన కొల్లోజు శ్రీనివాసచారితో 2010 సంవత్సరంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్న కానుకల కింద తమ పుట్టింటి వారు రూ.2.50లక్షల నగదు, పది తులాల బంగారు ఆభరణాలు ముట్ట చెప్పారు. వారికి ఒక కుమారుడు జన్మించాడు. కొంత కాలం తర్వాత అత్తింటి వారి నుంచి వేధింపులు మొదలయ్యాయి. భర్త శ్రీనివాసచారి, మామ ఆంధ్రయ్య, అత్త సుశీల, బావ సత్యనారాయణ, తోటి కోడళ్లు మమత, నిత్య, మరిది దేవేందర్‌లు అదనపు వరకట్నం కోసం వేధించారని బాధితురాలు రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

గంభీరావుపేటలో దొంగతనం


ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

గంభీరావుపేట, ఆగస్టు 2 :మండల కేంద్రంలోని దుద్డి విజయ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బీరువా పగుల గొట్టి రెండు తులాలన్నర బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి ఎత్తు కెళ్లారు. విజయ అత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో చనిపోయింది. ఇల్లు వీడాలని చెప్పడంతో విజయ కుటుంబం వేరే ఇంట్లో అద్దెకు ఉంటోంది. ప్రతీ రోజు ఉదయం సొంతింటికి వచ్చి ఇంటి పనులు చేసి తిరిగి అద్దె ఇంటికి వెళ్తోంది. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగుల గొట్టి ఉంది. బీరువా తెరిచి, వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. పోలీస్‌లకు సమాచారం అందించడంతో ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, ఎస్సై రాంమోహన్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ టీం బృందం ఇంటి పరిసరాలను పరిశీలించింది.


ఎస్‌యూ డిగ్రీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 2: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్, జూన్, 2024లో (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) నిర్వహించిన 2, 4, 6వ సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను శుక్రవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలు www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గొల్లపల్లి, ఆగస్టు 2: గొల్లపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో గత నెల కూల్ డ్రింక్ అనుకుని ప్రమాదవశాత్తు గడ్డి మందు తాగిన బొలిశెట్టి ప్రభాకర్ (39) పదకొండు రోజుల అనంతరం పరిస్థితి విషమించి అసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 22న రాజు శ్రీనివాస్ అనే రైతు పొలంలో వరి నారు లాగేందుకు ప్రభాకర్ వెళ్లాడు. మధ్యాహ్నం వేళలో ఒడ్డు పై ఉన్న థమ్సప్ బాటిల్‌లో పొరపాటున కూల్ డ్రింక్ అనుకుని ప్రమాదవశాత్తు గడ్డి మందు తాగాడు. గమనించిన తోటి స్నేహితులు హుటాహుటిన వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేట్ వాహనంలో జగిత్యాలలోని ఓ ప్రైవేట్ అసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుడి సూచన మేరకు కరీంనగర్ అసుపత్రికి తరలించి అక్కడ రెండు రోజుల పాటు వైద్యచికిత్సలు చేయించారు. అయితే, అక్కడి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని కిమ్స్ అసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయిస్తున్నారు. అయితే, పదకొండు రోజులు అనంతరం పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, పాప, బాబు ఉన్నారు. మృతుడి తల్లి బొలిశెట్టి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గండాలు దాటనున్న గౌరవెల్లి



- రిజర్వాయర్ పెండింగ్ పనుల పూర్తికి కేబినెట్ ఆమోదం
- రూ.437 కోట్ల విడుదలకు నిర్ణయం
- 17 ఏళ్ల కల సాకారమవుతోందని రైతుల సంతోషం

హుస్నాబాద్, ఆగస్టు 2: మెట్ట ప్రాంత వరప్రదాయిని గౌరవెల్లి రిజర్వాయర్ గండాలు ఇక తొలగిపోనున్నాయి. ఇక్కడి పొలాల్లో గోదావరి జలసవ్వడులను చూడాలనే ఈ ప్రాంత రైతాంగ నిరీక్షణ ఫలించబోతుంది. 17 ఏళ్ల క్రితం నుంచి ఈ రిజర్వాయర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు రిజర్వాయర్ పనులు పూర్తయి నీటిని నింపే అవకాశం ఉన్నా వ్యవసాయ భూములకు నీరందించే కాలువలు లేక.. రిజర్వాయర్ ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించకపోవడంతో పెండింగ్‌లోనే ఉంటూ వస్తున్నది. ఈ క్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎన్నికల్లో గెలిచిన వెంటనే రిజర్వాయర్‌ను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్ గౌరవెల్లి రిజర్వాయర్ పెండింగ్ పనుల పూర్తికి సవరించిన అంచనా ప్రతిపాదనల ప్రకారం రూ.437 కోట్లు కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. ఇక గౌరవెల్లి రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతాయని రైతులు సంతోషపడుతున్నారు.

2007లో శంకుస్థాపన

వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం సాగించే మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజకవర్గాలతో పాటు వరంగల్ జిల్లాలోని పలు గ్రామాలకు సాగు నీరందించాలని శ్రీరాంసాగర్ ఇందిరమ్మ వరదకాలువ గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ల నిర్మాణానికి 2007 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హుస్నాబాద్‌లో శంకుస్థాపన చేశారు. ఒప్పందం ప్రకారం ఈ రిజర్వాయర్ల పనులు ఐదేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా రీ డిజైన్ ఇతర కారణాలతో 17 ఏళ్లుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ ఈ రిజర్వాయర్‌ను సందర్శించి దీనిని రీడిజైన్ చేశారు. 1.4 టీఎంసీలు ఉన్న గౌరవెల్లి రిజర్వాయర్ ను 8.23 టీఎంసీలకు పెంచారు. దీంతో అదనంగా భూసేకరణ చేయాల్సి వచ్చింది. ఎలాంటి అనుమతులు లేకుండా రిజర్వాయర్ ఎత్తుపెంచారని నిర్వాసితులు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఇప్పటికీ కూడా ఎన్‌జీటీలో ఈ కేసు ఉంది.


రిజర్వాయర్‌లోకి వస్తున్న నీరు(ఫైల్)

పూర్తయిన ట్రయల్ రన్

8.23 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లోకి 2 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే 32 మెగావాట్ల సామర్థ్యం ఉన్న చైనా నుంచి వచ్చిన మూడు మోటార్లను బిగించారు. 2022 జూలై 31వ తేదీన అందులోని ఒక మోటార్‌తో 10 నిమిషాల పాటు ట్రయల్ రన్ నిర్వహించారు. మరో రెండు రోజుల అనంతరం అధికారులు రెండో మోటారు, మరో రెండు రోజులకు మూడో మోటారు ట్రయల్‌రన్ చేశారు. గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి నీటిని మిడ్‌మానేరు ద్వారా బెజ్జంకి మండలం తోటపల్లి ఆన్‌లైన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి తీసుకవస్తారు. మొదటి డిజైన్ ప్రకారం రూ.409 కోట్లతో చేపట్టిన ఈ సొరంగం పనులు పూర్తయిన అనంతరం రీ డిజైన్‌లో భాగంగా అదనంగా మరో రూ.380 కోట్లతో పనులు చేశారు. తోటపల్లి ఆన్‌లైన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 16 కిలోమీటర్ల దూరంలో రేగొండ వద్ద గౌరవెల్లి రిజర్వాయర్ ఉంటుంది. ఇందులో 12 కిలోమీటర్ల మేర సొరంగం ఉంటుంది. 5.6 మీటర్ల టన్నెల్‌షిప్‌తో 32 క్యూబిక్‌తో నీటిని తీసుకెళ్లే విధంగా సొరంగం నిర్మించారు. 50 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పు, 110 మీటర్ల లోతుతో సర్జ్‌పూల్ (నీళ్ల సంపు), 61మీటర్ల పొడవు, 17 మీటర్ల వెడల్పు, 130 మీటర్ల లోతుతో పంపుహౌజ్‌ను నిర్మాణం చేశారు. ట్రయల్ రన్‌తో రిజర్వాయర్‌లో ఒక టీఎంసీ నీటిని కూడా నింపారు.

1.06 లక్షల ఎకరాలకు సాగు నీరు

గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తయితే 1.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. హుస్నాబాద్ నియోజకవర్గంలో 57,852 ఎకరాలు, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 48, 148 ఎకరాలకు సాగునీరందుతుంది. ఈ రిజర్వాయర్‌కు రెండు ప్రధాన కాలువలు ఉండగా కుడి కాలువ ద్వారా 90 వేల ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 16వేల ఎకరాలు సాగవుతాయి.



రాబోయే సీజన్‌లో గౌరవెల్లి ద్వారా నీరందిస్తాం
: మంత్రి పొన్నం ప్రభాకర్

రాబోయే సీజన్‌లోపు గౌరవెల్లి ద్వారా సాగు నీరందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాలువలకు సంబంధించి రూ.437 కోట్లు బడ్జెట్‌లో ఆమోదించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారని, అప్పుడే 80 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత కుర్చీ వేసుకొని ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పి పదేళ్లయినా పట్టించుకోలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితులపై నిరంకుశత్వంగా వ్యవహరించిందని గుర్తుచేశారు. ఇక కాలువల నిర్మాణం వేగం చేస్తామని చెప్పారు.

వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు త్వరగా మంజూరు చేస్తున్నాం

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, ఆగస్టు 2: రైతులకు త్వరగా వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ) వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది 689 సర్వీసులను మంజూరు చేయగా, ఈ ఏడాది 937 సర్వీసులను మంజూరు చేశామని తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే 248 సర్వీసుల మంజూరు(36 శాతం) పెరిగిందని అన్నారు. సర్వీసుల మంజూరు మొత్తం ఆన్‌లైన్ చేయడం ద్వారా ఎప్పటికప్పుడు దరఖాస్తు ఎక్కడ పెండింగ్ ఉంది, ఎవరి దగ్గర పెండింగ్ ఉంది దానికి గల కారణాలను సవివరంగా అగ్రికల్చర్ పోర్టల్ (ఆన్‌లైన్)లో చూసుకునే వెసులు బాటు ఉందన్నారు. దీని ద్వారా మంజూరులో ఆలస్యం లేకుండా తొందరగా మంజూరు అవుతున్నాయని అన్నారు.

అలాగే ఈ- స్టోర్స్ విధానం ప్రవేశపెట్టడం ద్వారా కావాల్సిన మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకొని మెటీరియల్‌ను కావాల్సిన సమయంలో తీసుకొని పనులు ప్రారంభించవచ్చన్నారు. పేపర్ పనిలేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం విద్యుత్ శాఖకు, రైతులకు ఎంతో మేలు చేకురుతుందని చెప్పారు. అలాగే ఒక పనికి సంబంధించిన మెటీరి యల్ ఏమైనా మిగిలి ఉంటే వేరే పనికి పేపర్ ట్రాన్సాక్షన్ ద్వారా మార్చుకొనే వెసులు బాటు మొత్తం కూడా ఆన్‌లైన్‌లోనే చేశామని తెలిపారు. ఈ పద్ధతి వలన కూడా ఎంతగానో సమయం ఆదా అవుతుందని వివరించారు. ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యాన్ని కూడా పెంచామని, వంగిన పోల్‌లు, లూస్ లైన్‌లను కూడా సరి చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ అధికారులు రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. రైతులకు వ్యవసాయ సర్వీసుల మంజూరుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని వెనువెంటనే మంజూరు చేసేందుకు ఆహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు .

విష జ్వరంతో మహిళ మృతి


శ్రీలత (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 2: పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన శనిగరపు శ్రీలత (35) విష జ్వరంతో గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల చెప్పిన వివరాల ప్రకారం.. శనిగరపు శ్రీలత ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతూ జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నా తగ్గపోవడంతో హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం మృతిచెందింది. మృతురాలికి భర్త శ్రీనివాస్, ఇద్దరు కుమారులు హర్ష, సూర్య ఉన్నారు.

యువతిపై అత్యాచారయత్నం: కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 2: కరీంనగర్‌లో కోతిరాంపూర్‌లో మంచిర్యాల జిల్లాకు చెందిన యువతి (20)పై రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామన్నపేటకు చెందిన చింతం వంశీకృష్ణ(21) అత్యాచార యత్నం చేశాడని కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్న వంశీకృష్ణ కొద్దిరోజుల కిందట యువతితో పరిచయం పెంచుకుని గురువారం ఆమెను కరీంనగర్‌కు రావాలని కోరాడు. ఆమె కరీంనగర్‌కు వచ్చిన సమయంలో అత్యాచారయత్నం చేవాడని బాధితరాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అత్యాచారయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నిందితుడికి 8నెలల జైలు శిక్ష

హుజూరాబాద్, ఆగస్టు 2: ఓ మహిళ ఇంట్లోకి చొరబడి చంపుతానని బెదిరించిన వ్యక్తికి జడ్జి ఎనిమిది నెలల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన ప్రకారం.. ఫిబ్రవరి 2, 2024న హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఓ మహిళ ఇంటి పక్కనే ఉండే బుర్ర చక్రపాణి అకారణంగా ఆమె ఇంట్లోకి చొరబడి కత్తితో చంపుతాననంటూ తల వెంట్రుకలు పట్టుకొని బెదిరించాడు. దీంతో మహిళ హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని విచారణ జరిపి, కోర్టులో చార్జిషీటు వేశారు. కోర్టులో ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం జడ్జి శ్రీసాయిపద్మ నిందితుడికి 8 నెలల జైలు శిక్షతో పాటు రూ.300జరిమానా విధించారు.

నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, ఆగస్టు 2: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామ కమాన్ వద్ద సిద్దిపేటకు చెందిన వల్లెపు దేవదాస్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. అనంతగిరికి చెందిన గొల్లపల్లి రమేష్ ద్విచక్రవాహనం గురువారం చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. శుక్రవారం వాహనాల తనిఖీ చేస్తుండగా దేవదాస్‌ను పట్టుకున్నట్లు, అతడిపై సిద్దిపేటలో రెండు కేసులు ఉన్నట్లు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మేడిపల్లి, ఆగస్టు 2: మేడిపల్లి గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్న మ్యా కల శేఖర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మరిపెల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన శేఖర్ వ్యక్తి కిరాణం నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. అత్యాశతో అధిక డబ్బు సంపాదించాలనే మొజులో పడి తక్కువ ధరకు గంజాయిని విక్రయించి ఎక్కువ ధరకు యువతకు విక్రయించాలని మేడిపల్లి, కొండాపూర్ పరిసరాల్లోని యుతనుకు గంజాయి అమ్మేందుకు వచ్చాడు. ఈ సమాచారం పోలీసులకు అందడంతో ఎస్పీ ఆదేశాల మేరకు దాడి చేసి అతడిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 565 కిలోగ్రాముల గంజాయి మోటర్‌సైకిల్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు, కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్సై శ్యామ్‌రాజ్, సిబ్బంది దినేష్, అనిల్, చందు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సురేశ్‌గౌడ్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన యువకుడు లింగాల సురేశ్‌గౌడ్ (28) మండల కేంద్రం శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. గ్రామంలోని సురేశ్‌గౌడ్ ఉపాధి నిమిత్తం కొలంగా మహారాష్ట్రకు వలస వెళ్తుండేవాడు. ఈ నెల 1న స్వగ్రామానికి చేరుకున్నాడు. శుక్రవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తున్న క్రమంలో కింద పడిపోయి చనిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్ పరిశీలించారు. గుండెపోటుతో మృతి చెందడా..? లేక వాహనం ఢీకొనడంతో చనిపోయడా.. అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి తల్లి ఎల్లవ్వ, భార్య స్వాతి, కూతురు రితన్యా, అన్విత్ లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య


స్రవంతి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో కడుపునొప్పి భరించలేక సకినాల స్రవంతి(28) అనే వివాహిత ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన స్రవంతికి నారాయణపూర్‌కు చెందిన సకినాల దేవరాజుతో పదేళ్ల కిందట వివాహమైంది. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఏడాది కిందట దేవరాజు ఉపాధి నిమిత్తం దుబాయి వలస వెళ్లాడు. కొంత కాలంగా స్రవంతి అనారోగ్యంతో బాధ పడుతోంది. గురువారం రాత్రి తాను కడుపునొప్పికి తాళలేకపోతున్నానని తండ్రి శంకరయ్యకు ఫోన్ చేసి చెప్పింది. తండ్రి రాత్రి నారాయణపూర్ చేరుకొని అడుగ గా కడుపునొప్పి భరించలేక ఎలుకల మందు తాగానని తెలిపింది. దీంతో ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి శంకరయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

అప్పుల బాధతో గొర్రెల కాపరి ఆత్మహత్య


రాజయ్య మృతదేహం

రామడుగు, ఆగస్టు 2: అప్పుల బాధతో ఓ గొర్రెల కాపరి ఆత్మహత్య చేసుకున్న ఘటన దేశరాజుపల్లిలో విషాదం నింపింది. ఎస్ఐ సురేందర్ కథనం ప్రకారం.. దేశ రాజుపల్లి గ్రామానికి చెందిన అమరగొండ రాజయ్య (53) గొర్లను మేపకుంటూ జీవిస్తున్నాడు. కుటుంబ పోషణలో భాగంగా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన రాజయ్య గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన గ్రామస్థులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య కనకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

జమ్మికుంట, ఆగస్టు 2: పాత పగలు మనసులో పెట్టుకుని తనతో పాటు భార్య, కుమారుడిపై ఓ కుటుంబం దాడి చేసిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీస్‌లు వారిపై కేసు నమోదు చేశారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన రేవెల్లి సమ్మయ్య, భార్య కనకమ్మ, కుమారుడు రాజేష్‌లపై తిరుపతి, స్వరూప, ప్రకాష్, సింధు, అరవింద్ అనే వ్యక్తులు పాత పగలు మనసులో పెట్టుకుని తమపై దాడి చేశారని బాధితుడు సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 2: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి ఏడో రోజు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా 12,600 ఎస్ఆర్ఆర్ మిడ్ మానేరు డ్యాంలోనికి తరలిస్తున్నారు. నీటి ప్రవాహంతో వరదకాలువ ఉప్పొంగుతూ ప్రవహిస్తుండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. వివిధ గ్రామాల ప్రజలు వరద కాలువ, గ్రావిటీ కాలువల నీటి ప్రవాహాన్ని తిలకిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

బోయినపల్లి: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12,600 క్యూ సెక్కులు, మానేరు, ములవాగు ద్వారా 1890 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 311.080 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు 10.018 టీఎంసీల మేర నిల్వ ఉంది.

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 9 గంటల వరకు ప్రాజెక్టులోకి ఎగు వ ప్రాంతం నుంచి 7924 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.554 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.


గాయత్రి పంప్‌హౌస్ నుంచి వస్తున్న నీరు

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి, ఆగస్టు 2 : మండలంలోని నామాపూర్, ఏడు మోటలపల్లి గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పరామర్శించారు. మండలంలోని మ్యాకవెంకయ్యపల్లిలో సొంచాలు నడుపుతూ జీవనం భారమై ఆత్మహత్య చేసుకున్న గుండేటి మల్లేశం, పార్టీ యూత్ ఉపాధక్షులు లింగంపల్లి కరుణాకర్ తల్లి అనారోగ్యంతో మృతి చెందగా, నామాపూర్ గ్రామానికి చెందిన దుర్గయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి వారి కుటుంబాలను మాజీ మంత్రి ఈశ్వర్ పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని వారి మృతి పట్ల సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు లోక మల్లారెడ్డి, ఇనుగండ్ల కరుణాకర్ రెడ్డి, ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, సంతోష్, రాజశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధర్మపురి: మండలంలోని గోవిందులపల్లె బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కోల శంకర్ వారం రోజుల క్రితం మృతి చెందగా కటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట రైతు బంధు మండల అధ్యక్షుడు బీమయ్య, మాజీ సర్పంచ్ రాజయ్య ఉన్నారు.

గొల్లపల్లి : గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అనా రోగ్యాలతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పార్టీ నాయకులు హన్మండ్లు, శంకర్, జలేందర్, రాజశేఖర్, గంగాధర్, వెంకటమాధవరావు, లింగారెడ్డి, సత్తయ్య, మల్లారెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించొచ్చు

ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి

గొల్లపల్లి, ఆగస్టు 2 : వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్న క్రమంలో రైతులు పలు జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలను అరికట్ట వచ్చని ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో పొలంబాట కార్యక్రమాల్లో భాగంగా రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో భూమి పూర్తిగా తడిసిపోయి ఉంటుందని, దీనికితోడు గాలిదుమారంతో విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తెగిపడి ఉంటాయని, స్తంబాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ వరుణ్ కుమార్, ఏఈ దివాకర్ రావు, సబ్-ఇంజనీర్ దామోదర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రమణ, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజు, సిబ్బంది అనిల్, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారం



మొక్కలు నాటుతున్న కమిషనర్ మోహన్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2 (మెట్‌పల్లి): జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ అన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని జాతీయ రహదారికి ఇరువైపుల వన మహోత్సవంలో భాగంగా కమిషనర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యవరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అక్షయ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజిద్ పాల్గొన్నారు.

సొంత నిధులతో రహదారికి మరమ్మతులు

యువకుడిని అభినందించిన గ్రామస్థులు



వేంపేటలోని రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 2 : మండలంలోని వేంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో వర్షాలకు దెబ్బతిన్న ప్రధాన రోడ్డుకు గ్రామస్థుడు మ్యాదరి రామకృష్ణ సొంత నిధులతో మరమ్మతులు చేపించారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా దెబ్బతిని విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు లేక అధికారులు కూడా మరమ్మతులు చేపించకపోవడంతో స్పందించిన మ్యాదరి రామకృష్ణ స్పందించి తన స్వంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. దెబ్బతిన్న రోడ్డుకు సొంత నిధులతో మరమ్మతులు చేయించిన రామకృష్ణను ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి అశోక్‌గౌడ్, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్ అభినందించారు. రోడ్డు మరమ్మతులు వేయించడంతో పాఠశాల విద్యార్థులు, రైతులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

'ఆయూష్' ప్రవేశపరీక్షలో గొల్లపల్లి వాసి ప్రతిభ

జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు సాధించిన సాయికృష్ణ



గొల్లపల్లి, ఆగస్టు 2 : మూడు రోజుల క్రితం ప్రకటిం చిన ఆల్ ఇండియా ఆయూష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎం ట్రన్స్ టెస్ట్ (ఏఐఏపీ జీఈటీ) పరీక్ష ఫలితాల్లో గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన చాడ సాయికృష్ణ అనే వి ద్యార్థి జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు సాధించి జా తీయ స్థాయిలో మెరవగా, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థా నం సాధించి సత్తా చాటాడు. మండల కేంద్రానికి చెం దిన చాడ వనజ-శ్రీనివాస్ దంపతుల కొడుకైన సాయి కృష్ణ మొదటి నుంచి చదువులో ముందుంటున్నాడు. సాయికృష్ణ సంగారె డ్డిలోని ఎంఎన్ఆర్ వైద్య కళాశాలలో హోమియో పతి విద్యనభ్యసించాడు. సాయికృష్ణ తన ప్రతిభను కనబర్చడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంటింటా మొక్కలు పంపిణీ

ధర్మపురి, ఆగస్టు 2: ధర్మపురి పట్టణంలోని 11 వ వార్డులో కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు. ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటా మందారం, గులాబీ, మల్లె మొక్కల లాంటి పూల మొక్కలు పంపిణీ చేశారు.

అనంతరం కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ మా ట్లాడుతూ నాటిన ప్రతి మొక్కకు నీరు పోసి ట్రీగార్డు ఏర్పాటు చేసి సంరక్షిం చాలని అన్నారు. మొక్కలు పెరిగి పచ్చని వాతావరణం కూడ నెలకొంటుం ద ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ మేనేజర్ గంగాధర్, సా నిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, వార్డు ఆఫీసర్ ప్రమీల, ఆర్పీ పద్మ పాల్గొన్నారు.

అపోహలు లేకుండా తల్లి పాలు అందించాలి

జగిత్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వినోద్ కుమార్

జగిత్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అపోహలు లేకుండా పిల్లలకు తల్లి పాలు అందించాలని జగిత్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తాటిపాముల వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి లో అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలింతలు, గర్భిణీలకు పండ్లు, బ్రెడ్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముర్రుపాలు బిడ్డ పుట్టిన గంటలోపే అందించడం ద్వారా 22 శాతం నవజాత శిశు మరణాలు నివారించవచ్చన్నారు. మొదటి ఆరు నెలల వయస్సు వరకు తల్లిపాలు మాత్రమే ఇప్పించడం వల్ల పిల్లలకు మరణాలకు ముఖ్యమైన నీళ్ల విరోచనాలు, శ్వాస కోశ వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. రెండేళ్ల వరకు తల్లి పాలు మాత్రమే తాగించడం వల్ల పౌష్టికాహారంతో పాటు ఊబకాయం నివారించవచ్చన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ అరుణ లక్ష్మణ్, చంద్రమోహన్, రాజేందర్, బాపురెడ్డి, వడ్డగడ్డ శంకర్, శ్రీరాముల సుదర్శన్, గంగాధర్, దోపటి దేవదాస్, గోపి పాల్గొన్నారు.

సారంగాపూర్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీవో బి, వాణిశ్రీ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో బాగంగా శుక్రవారం సారంగాపూర్ మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంట లోపే ముర్రు పాలు



కొత్తధాంరాజుపల్లిలో పౌష్టికాహారం అందజేస్తున్న సూపర్‌వైజర్ శంకరమ్మ



తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తాగించాలన్నారు. తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని రోగ నిరోదక శక్తి పెరుగుతుందని తెలిపారు. పిడికెల్ అధికారి శివకుమారి, సఖీ అడ్మిన్ మనీల, సూపర్ వైజర్లు లత, శైలజ,పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.

కొడిమ్యాల : అంగన్‌వాడీ కేంద్రాలలో అంగన్‌వాడీ టీచర్లు తల్లిపా ల ప్రాముఖ్యతపై అవగాహన కలిపించారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని 2వ, 10వ, కోనాపూర్, తిర్మాలాపూర్, పోతారం, సంద్రల్లపల్లి, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. బరువు తక్కువ ఉన్న బిడ్డల ఆరోగ్యం కోసం తీసుకోవాలిసిన పోష కాహారంపై అవగాహన కలిపించారు. పుట్టిన శివువుకు ముర్రుపాలు పట్టించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు గడ్డం విజయ లక్ష్మి, మమత, రజిత, శ్రీలత, రాజేశ్వరీ, విజయ పాల్గొన్నారు.

మల్లాపూర్ : గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కొత్తధాంరాజుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలతో అవగాహన సదస్సును నిర్వహించారు. తల్లి పాలు బిడ్డకు పట్టడంతో లభించే అవష్యాకతపై గర్భిణీలు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయలు, మహిళలు పాల్గొన్నారు.

రాయికల్: అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహి ద్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఒడ్డెర కాలనీ, ఇటిక్యాల సెక్టార్ పరిధిలోని దావన్‌పెల్లి గ్రామాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రామ కార్యదర్శి గీతారాణి, ఏన్ఎం సుజాత, అంగన్‌వాడీ టీచ ర్లు లావణ్య, రోజా, ఆశ వర్కర్ సుమలత, కారోబార్ జలంధర్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: ప్రసవించిన తరువాత గంటలోపు పిల్లలకు ముర్రుపాలు పడితే వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని మండల వైద్యాధి కారి అంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని జగ్గసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ప్రశాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమాదిబేగం ఆధ్వర్యంలో బాలింతలకు, గర్భిణులు, మహిళలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశాలు పాల్గొన్నారు.

బీర్‌పూర్ : తల్లుల్లో అంతరాలను, అపోహలను తొలగించి తల్లిపాల ప్రాముఖ్యతను చాటి చెప్పాలని ధర్మపురి సీడీపీవో వాణిశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మండల సూపర్‌వైజర్ నీలిమ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో లచ్చాలు, రెవేన్యూ పరిశీలకులు శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శైలజ, లత, హెల్త్‌సూపర్‌వైజరు కిషోర్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, ఆయాలు, గర్భిణిలు పాల్గొన్నారు.



సారంగాపూర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సీడీపీవో వాణిశ్రీ

అధికారం కోసం దళితుల విచ్ఛిన్నానికి కుట్ర

జగిత్యాల అర్బన్, ఆగస్టు 2: కొందరు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోస మే దళితుల విచ్ఛిన్నానికి కుట్రలు చేస్తున్నారని మాల, మాల ఉపకులాల సం ఘాల నాయకులు ఆరోపించారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు వెలువడించిన తీర్పును నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద మాల, ఉపకు లాల సంఘ నాయకులు వర్గీకరణకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు, కండువాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర కులాల అభిప్రాయ సేకరణ లేకుండా ఏకపక్షంగా వర్గీకరణపై నిర్ణయం తీసు కొని తీర్పును వెలువరించడం దురదృష్టకరం అన్నారు. కేవలం ఒక వర్గానికి న్యాయం చేసేందుకు ఇరత వర్గాలకు అన్యాయం చేశారని ఆరోపించారు. అధి కారం, స్వార్థ రాజకీయాల కోసం కొందరు దళితులను చీల్చే కుట్రలో భాగమే వర్గీకరణ అని పేర్కొన్నారు. దళితుల జనాభా పెరిగినందున దామాషా ప్రకారం పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్‌ల శాతం పెంచాల్సింది పోయి, అందులో నుంచి ఓ వర్గాన్ని విభజించడం ముమ్మాటికీ కుట్రలో భాగమే నన్నారు. మాలల ఐక్యతను చాటిచెప్పేలా, రాజకీయ కుట్రలను తిప్పికొట్టేందుకు ఛలో డిల్లీకి తరలివెళ్లనున్నట్లు వారు తెలిపారు. వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి జగిత్యాల నుంచే జంగ్‌సైరన్ మోగిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాల, మాల ఉపకులాల సంఘ నాయకులు కారంగుల వసంత రావు, వేల్పుల ప్రవీణ్, చిత్తారి ప్రభాకర్, మ్యాదరి శ్రీహరి, కడమండ కమలాకర్, కొడిపల్లి నాగార్జున, ఎలమాద్రి కిషోర్, సంకె మహేష్, జవ్వాజి శంకర్, నారాయణ, యశ్వంతరావుపేట్ బుచ్చయ్య, లక్ష్మణ్ తదితరులున్నారు.



నిరసన తెలుపుతున్న మాల, ఉపకులాల నాయకులు

జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన జువ్వాడి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బొకే ఇస్తున్న జువ్వాడి

కోరుట్ల, ఆగస్టు 2 : రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తం కుమార్ రెడ్డిని శుక్రవారం హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు కలిసాడు. మంత్రికి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలను తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వివరించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలేటి మహిపాల్ రెడ్డిలతో పాటు పలు వురు పాల్గొన్నారు.

మైలారాపు లింబాద్రికి ఘన సన్మానం



లింబాద్రిని సన్మానిస్తున్న సురభి నవీన్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 2 (మెట్‌పల్లి): ఆర్యవైశ్య మహాసభ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్ని కైన మెట్‌పల్లి పట్టణానికి చెందిన మైలరపు లింబాద్రిని శుక్రవారం బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు సురభి నవీన్ ఘనంగా సన్మానించారు. నవీన్ కోరుట్ల నియోజకవర్గ బీ జేపీ నాయకులతో కలిసి లింబాద్రిని పూల మాలలు శా లువాతో సత్కారించి శుభాకంక్షాలు తెలిపారు. మెట్‌పల్లి పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్ పాల్గొన్నారు.

మతిస్థిమితం కోల్పోయి..నాలుగేళ్లకు ఇంటికి

సోషల్ మీడియా పోస్టింగ్‌తో కన్న వారి చెంతకు



రమేష్‌ను కోరుట్లలో తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కోరుట్ల, ఆగస్టు 2: మతి స్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమారుడు నాలుగేళ్లకు ఇంటికి చేరడంతో ఆ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా పోస్టింగ్ సహాయంతో స్పందించిన కౌన్సిలర్ అతడిని తల్లిదండ్రుల వద్దకు చేర్చాడు.

జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని తిలక్ రోడ్డుకు చెందిన కటుకం నారాయణ - సర్వసతి దంపతుల కుమారుడు రమేష్ మతిస్థిమితం సరిగా లేక నాలుగేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. విశాఖపట్నంలో తిరుగుతుండగా కోరుట్ల ప్రాంతానికి చెందిన అడెపు శాంత మూర్తి అనే వ్యక్తి కోరుట్ల పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించి వెంటనే అతడిని ఓల్డ్ ఏజ్ హోంలో చేర్పించాడు. అతడి స్నేహితుల వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. దీంతో స్పందించిన కోరుట్లకు చెందిన 32వ వార్డు కౌన్సిలర్ జిందం లక్ష్మినా రాయణ వెంటనే రమేష్ కటుంబ సభ్యులకు సమాచారం అందించి వారితో కలిసి గురువారం విశాఖపట్టణం చేరుకుని శాంతకుమార్ సహకారంతో రమేష్‌ను శుక్రవారం కోరుట్ల పట్టణానికి తీసుకువచ్చారు.

కోరుట్ల పోలీసుల ముందు రమేష్‌ను అతని తల్లిదండ్రులకు అప్పగించారు.

గోమాతకు అంత్యక్రియలు

మానవత్వం చాటుకున్న వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 2: జగిత్యాల పట్టణంలోని స్థానిక బాలాజీ థియేటర్ సమీపంలో ప్రమాద వశాత్తు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో మృతిచెందిన గోమాతకు అంత్యక్రియలు నిర్వహించి వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు తమ మానవత్వం చాటుకు న్నారు. ఈ నేపథ్యంలో ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, వెటర్నిటీ హాస్పిటల్‌లో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం హిందూసాం ప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వ హించినట్లు వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు తెలిపారు. ఈ అంత్యక్రియలకు సహకరించిన పోలీసు, మున్సిపల్ సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. గోమాతలను రోడ్లపై వదిలిపెట్ట వద్దని, వాటి సంరక్షణను యజమానులు చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు గాజోజు సంతోష్‌కుమార్, మావిడాల రాములు, పాదం మహేందర్, విశ్వ నాథ్, కృష్ణ, విష్ణు, విఘ్నేష్, గౌతమ్, పవన్ తదితరులున్నారు.

మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలి

డీఎస్పీ రఘుచందర్

బుగ్గారం, ఆగస్టు 2 : గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం బుగ్గారం మండల కేంద్రంలోని శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సామాజిక స్పృహ కార్యక్రమాల్లో భాగంగా జరిగిన గంజాయి, డ్రగ్స్, వంటి మత్తు పదార్థాల వాడకం వల్ల ఏర్పడే దుష్ఫలితాల పై, సోషల్ ఇష్యూష్ నివారణ పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించగా డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేటి యువ త, విద్యార్థులు అసాంఘీక కార్యకలాపాలకు, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల కు యువత అలవాటు పడి పెడదారి పడుతున్న క్రమంలో వారిలో మార్పు తేవాలనే ఉద్దేశంతో ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు సామాజిక అవగాహన కార్యక్రమాలను నిర్వహి స్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై మాడ శ్రీధర్ రెడ్డి, శ్రీ గ్లోబల్ హై స్కూల్ కరస్పాండెంట్ డా. నక్కరాజు, పలువురు న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

సంక్షిప్తం సమాచారం

ఇబ్రహీంపట్నం (మెట్‌పల్లి): పట్టణంలోని మహాలక్ష్మీ ఆలయంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.

సారంగాపూర్ : సారంగాపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా వై. రమేష్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు బదిలీపై వచ్చిన సివిక్స్ అధ్యాపకులు ఎం, శ్రీధర్‌లకు కళాశాల అధ్యాపక బృందం స్వాగతం పలికారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేట గ్రామంలో గల శివలింగ ఫర్టిలైజర్ దుకాణంలోని స్టాక్‌ను శుక్రవారం జగిత్యాల మండల అగ్రికల్చర్ ఏవో వినీల తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో డీలర్ మహేష్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడంతో ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గురువారం రాత్రి మాదిగ కుల సంఘం నాయకులు సంబరాలు ఘనంగా నిర్వహించారు. మాదిగ సంఘం నాయకులు అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి, ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని మాదిగ సంఘం ఓట్లను చీల్చొద్దని నాయకులు కోరారు. శుక్రవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఎంపీవో మహేశ్వర్‌రెడ్డికి ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామాల్లోని మాదిగ సంఘం నాయకులు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు చిన్నారాజం, గడ్డం మహేష్, రాజం, లక్ష్మినర్సయ్య, శంకర్, ఉన్నారు.

మల్యాల: దుకాణాల వద్ద చెత్త లేకుండా, ప్లాస్టిక్ వస్తువులు లేకుండా యజమానులు పారిశుద్యం పాటించాలని ఎంపీవో ప్రవీణ్ సూచించారు. మల్యాల క్రాస్ రోడ్డు వద్ద చెత్త పడేస్తే తగు చర్యలు తీసుకుంటామంటూ దుకాణదారులకు నోటీస్‌లు అందజేశారు. పోగు చేసిన చెత్తను గ్రామ పంచాయితీ ట్రాక్టర్లలోనే పడేయాలని అపరిశుభ్రత లేకుండా చూడలన్నారు.

పెగడపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి కొండల్‌రెడ్డి తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టర్ నందు నమోదు చేసి పోగొట్టుకున్న మొబైల్‌ను ఫిర్యాదుదారునికి శుక్రవారం ఎస్ఐ రవి కిరణ్ అందజేశారు.

మెట్‌పల్లి రూరల్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ఎల్లాల అంజిత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని ఆత్మనగర్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నిజాముద్దీన్, మాజీ ఉపసర్పంచ్ చిలివేరి విజయ్, వైద్యురాలు కృ ష్ణవేణి, హెచ్ఈవో రమేష్, సూపర్‌వైజర్ ప్రభావతి, ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్ : గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆదాయాభివృద్ధి మార్గాలను పెంచే కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సెర్ప్ డీపీఎం వనజ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో వీఓఏల కు ఏర్పాటు చేసిన అవగాహనా సమావేశానికి హాజరై మాట్లాడారు.

ధర్మపురి: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన సీఎం సభకు పదోన్నతి పొందిన టీచర్లు శుక్రవారం ధర్మపురి నుంచి తరలివెళ్లారు. ఆర్‌టీసీ బస్సు ద్వారా సీఎం కృతజ్ఞత సభకు తెలుగు, హిందీ, ఉర్దూ, పీఈటీ, అన్ని సబ్జెక్టుల టీచర్లు బయలు దేరారు.

జగిత్యాల: జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కల్వకుంట్ల రామ కృష్ణ శుక్రవారం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మల్యాల మండలం కొండగట్టు ఈవోగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎల్ రామకృష్ణ సైతం కలెక్టర్‌ను కలిశారు.

సారంగాపూర్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంటని కోనాపూర్, పెంబట్ల గ్రామాల్లో పర్యటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు వర్షకాలంలో ఇంటి తవరణలో నిల్వ ఉన్న నీటిని నిల్వ ఉంచకూడదని అన్నారు.

మాజీ సీఎం దిష్టిబొమ్మ దహనం

కోరుట్ల, ఆగస్టు 2 : మంత్రి సీతక్కకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దగ్ధం చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేసి కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖలను ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.